క్లుప్తంగా

భట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



డిప్యూటీ సీఎం మల్లు భట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాందాస్, నాయకులు

కొణిజర్ల: డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లను కొణిజర్ల మండల నాయకుడు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో కోసూరి శ్రీనివాసరావు, గాలిబ్‌పాషా, కోటేశ్వరరావు, మోష, రంజాన్, శివ, శ్రీను, గాలిబ్ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన ఏఎంసీ అధికారులు



మంత్రి తుమ్మలను శాలువాకప్పి సన్మానిస్తున్న ఉద్యోగులు

కారేపల్లి: వ్యవసాయశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తుమ్మల నాగేశ్వరరావుని ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, నరేష్‌కుమార్ హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాకప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడారు. సీసీఐ కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపట్టాలన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



మాలధారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వైరా: వైరాలో అయ్యప్ప మాలధారణ చేసిన అయ్యప్ప స్వాములకు ముస్లిం దంపతులు అన్నదానం చేసి మత సామరస్యాన్ని చాటుకున్నారు. వైరా కోదండ రామాలయంలో వైరాకు చెందిన షేక్ జాన్‌పాషా, మైబి దంపతులు స్వాములకు అన్నదానం నిమిత్తం రూ.10,116 అందజేశారు. ఈ సందర్భంగా కోదండ రామాలయంలోని అయ్యప్పస్వామి పీఠం వద్ద జాన్ పాషా దంపతులు పూజలు నిర్వహించారు. పలువురు దీక్షా పరులు ఈ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి శ్రీరామనేని శ్రీనివాసరావు, బాసాటి రామారావు, దార్న ఉపేందర్, రేచర్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపురంలో గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న స్థానికులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. సింగరేణిలో 36.2 ఎకరాల భూమికి అవార్డు పాస్ చేసి గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి మాట్లాడుతూ.. 65 మంది రైతులు ఉన్నారని.. వారి అభ్యర్థనలు తెలుసుకునేందుకు గ్రామసభ ఏర్పాటు చేశామన్నారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెట్టుమాల రేణుక, సింగరేణి పీఓ నర్సింహారావు, ఆర్ఐలు జానిమియ, నరేష్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంతో పాటు మండలంలోని కిష్టారం, చెరుకుపల్లి గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ సత్తుపల్లి ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా.. పట్టణంలోని జలగం నగర్, వెంగళరావునగర్, వేంసూరురోడ్, బైపాస్‌రోడ్, ఎన్టీఆర్‌నగర్, విద్యానగర్, శ్రీనివాసథియేటర్‌రోడ్, గాంధీనగర్, జవహర్‌నగర్, పోస్టాఫీస్‌రోడ్, లలితకుమారిరోడ్, మసీద్‌రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చలికాలంలో వెచ్చని నేస్తాలు

- ఊపందుకున్న ఉన్ని దుస్తుల కొనుగోళ్లు
- చిన్న పిల్లల నుంచి పెద్దల దాక..
- ఆకట్టుకునే డిజైన్లలో స్వెట్టర్లు
- చలి నుంచి ఉపశమనం పొందుతున్న ప్రజలు

సండే స్పెషల్



సత్తుపల్లిలో స్వెట్టర్ల దుకాణాల వద్ద కొనుగోళ్ల సందడి

సత్తుపల్లిటౌన్: చలిగాలులు వణికిస్తున్నాయి.. పగటి ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. రాత్రివేళలతో పాటు పగటి సమయాల్లో కూడా చలిగాలులు వీస్తుండటంతో ప్రజలు స్వెట్టర్లను ధరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పిల్లలు స్కూళ్లకు వెళ్లేటప్పుడు.. ద్విచక్రవాహనాలు నడిపేవారు.. స్వెట్టర్లు, మంకీక్యాప్‌లు, మఫ్లర్లను ధరిస్తున్నారు. చిన్నారులకు ఆకర్షణీయమని మంకీ క్యాప్‌లు మార్కెట్‌లో ఉన్నాయి. చలి నుంచి ఉపశమనం పొందేందుకు.. వెచ్చదనం కోసం ఉన్ని, ఇతర ప్రత్యేక దుస్తులను ప్రజలు ఆశ్రయిస్తున్నారు.

పట్టణంలో వెలిసిన విక్రయ కేంద్రాలు..

చలిగాలులు తీవ్రంగా వీస్తుండడంతో సత్తుపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు ఏటా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే పట్టణంలోని విగ్రహాల సెంటర్ ప్రాంగణం, ఫారెస్ట్ చెక్‌పోస్టు, రెవెన్యూ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో స్వెట్టర్లు, మఫ్లర్ల దుకాణాలు వెలిశాయి. చలికాలం దృష్ట్యా మధ్యప్రదేశ్‌కు చెందిన సుమారు 30 కుటుంబాలు ఈ దుకాణాలను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొని ఉన్ని దుస్తులను విక్రయించి ఉపాధి పొందుతున్నారు.

ఆకర్షణీయంగా మోడళ్లు..

శీతాకాలం దళసరి దుస్తులు వేసుకోక తప్పదు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరు చలి నుంచి ఉపశమనం పొందేందుకు స్వెట్టర్లు ధరిస్తారు. పట్టణంలోని ఈ దుకాణాల వద్ద వివిధ రకాల స్వెట్టర్లు, చేతిగ్లోవ్స్, తలకు మంకీ క్యాప్‌లు, జర్కిన్లు, మఫ్లర్లు, ఉన్నితో చేసిన దుస్తులు, సాక్స్‌లు, రగ్గులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, రైన్‌కోట్లు అందుబాటులో ఉన్నాయి.

అందరికీ అందుబాటులో..

నెల వయస్సు ఉన్న చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు స్వెటర్లు ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నాయి. స్త్రీ, పురుషులకు వేర్వేరు డిజైన్లలో లభిస్తుండడం విశేషం. ఆకర్షణీయంగా రంగులు, మోడల్స్‌లలో లభిస్తున్నాయి. రూ.200 లు మొదలుకొని రూ.2 వేల వరకు వివిధ రకాల ఉన్ని దుస్తులను పరిసర ప్రాంత ప్రజలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రగ్గులు



వివిధ రకాల మంకీక్యాప్‌లు, మఫ్లర్లు

ఉపాధికోసం వచ్చాం..



అన్ని వయస్సుల వారికి రకరకాల మోడల్స్, రంగులలో దుస్తులు అందుబాటులో ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి 30 కుటుంబాలు వచ్చాం. శీతాకాలంలో స్వెట్టర్లను తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసుకొని మూడు నెలల పాటు విక్రయించి ఉపాధి పొందుతాం. హోల్‌సెల్ ధరలకే విక్రయిస్తున్నాం.

– కె.ఇశ్వర్‌సింగ్, రగ్గుల వ్యాపారి, మధ్యప్రదేశ్

ఎక్కువ కేసులు పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి



మధిర: మాట్లాడుతున్న న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి

మధిర/సత్తుపల్లిటౌన్: ఈ నెల 30న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, మధిర జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు సత్తుపల్లిలోని సబ్‌కోర్టులో, మధిర కోర్టులో శనివారం పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించాలని సూచించారు. కేసులు రాజీ అయ్యేందుకు బార్ అసోసియేషన్ కూడా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్‌జడ్జి ఎస్‌కె ఆయేషాసరీన్, ఏసీపీలు రెహమాన్, రామానుజం, సీఐలు జాటోత్ వసంత్‌కుమార్, హనూక్, ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావు, ఎస్సైలు కుశ, వీరప్రసాద్, రఘు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనేతలతో పోలింగ్ బూత్‌లవారీగా సమీక్ష నిర్వహించారు. గ్రామాలలో పార్టీ బలహీనంగా ఉందో.. ఎక్కడ బలంగా ఉందో చర్చించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని పూర్తి స్థాయిలో బలోపేతం చేస్తామన్నారు.

నేడు కందుకూరులో సమావేశం..

వేంసూరు మండలం కందుకూరులో పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు సండ్ర తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొంటారని, నియోజకర్గంలోని నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వేడుకగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

తల్లాడ: తల్లాడలోని కృష్ణమందిరం వద్ద శనివారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. అర్చకుడు తనుగుల మణికంఠ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 13 మంది స్వాములకు ఇరుముడి కట్టారు. శబరిమలైకు బయలు దేరారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో అయ్యప్ప నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఉద్యాన పంటలను సాగుచేసుకోవాలి

చింతకాని: ఉద్యాన పంటలను సాగు చేసేందుకు మొగ్గుచూపాలని ఉద్యానవన శాఖాధికారి నగేష్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో ఉద్యాన పంటల సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చన్నారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు పలు రాయితీలను కల్పిస్తుందని, రైతులు ఉద్యాన పంటల సాగుపై ఆలోచన చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పలు రకాల ఉద్యాన పంటల సాగులో మెళుకువలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారి నగేష్

పిల్లలతో స్నేహంగా మెలగాలి



మాట్లాడుతున్న సీఎంఓ రాజశేఖర్

తల్లాడ: తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహంగా మెలగాలని సీఎంఓ రాజశేఖర్ అన్నారు. శనివారం తల్లాడ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ ఉపాధ్యాయులచే చక్కని విద్యా బోధన అందిస్తుందన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నర్సింహారావు, హెచ్‌ఎం ప్రసూన, కమలాకర్‌రెడ్డి, ఉంగరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సౌత్ జోన్ టోర్నీకి జేవీఆర్ క్రీడాకారులు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

సత్తుపల్లిటౌన్: కాకతీయ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ వాలీబాల్, ఖో–ఖో టోర్నీల్లో పాల్గొనే జట్లలో సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్థానం దక్కింది. ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే పురుషుల వాలీబాల్ పోటీలకు లక్ష్మణస్వామి, పి.సాయికుమార్, డి.ప్రదీప్, ఖో–ఖో మహిళల జట్టుకు ఎస్.చిలకమ్మ ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు డి.బంగారి, మధు, విజయలక్ష్మి, రవికుమార్, పి.రామచంద్రరావు, ఎం.రాంబాబు, వినోద్‌కుమార్, సారంగపాణి, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, మాధవి, పీర్‌సాహెబ్, శ్రీధర్, వీరారెడ్డి అభినందించారు.

18న మండల సర్వసభ్య సమావేశం

తల్లాడ: ఈ నెల 18న తల్లాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండపల్లి శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 1 గంటకు జరిగే ఈ సమావేశంలో వివిధ శాఖల పని తీరుపై సమీక్షించనున్నట్లు తెలిపారు. కావున సభ్యులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

18న విద్యుత్ వినియోగదారుల సదస్సు

కారేపల్లి: ఈ నెల 18న కారేపల్లి విద్యుత్ ఉప కేంద్ర ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు కారేపల్లి విద్యుత్ శాఖ ఏఈ విజయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చుట, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీస్ రద్దు వంటి సంబంధించిన సమస్యలను విద్యుత్ వినియోగదారులు రాత పూర్వకంగా ఫిర్యాదులు అందించవచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కారేపల్లి మండలంలోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

17న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

మధిర: ఈ నెల 18న దెందుకూరు గ్రామంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు స్వామి కల్యాణం నిర్వహిస్తున్నామని, దెందుకూరు, పరిసర ప్రాంత భక్తులు ఈ కల్యాణంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. స్వామి కల్యాణానికి పీటల మీద కూర్చునే భక్తులు ఎవరైనా ఉంటే ముందుగా దేవస్థానం నిర్వాహకులకు సమాచారం అందించాలన్నారు. అదనపు సమాచారం కోసం 9949817297 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై పోలీసులు శనివారం వాహన తనిఖీని చేపట్టారు. అతివేగం, అజాగ్రత్తగా వెళ్తున్న మూడు వాహనాలను గుర్తించి వాహనాలకు సంబంధించిన యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సై అవగాహన కల్పించారు.

రైతులను మోసం చేస్తున్న పత్తి వ్యాపారులు

తల్లాడ: పత్తి వ్యాపారులు, దళారులు ఒక్కటై రైతులను మోసం చేస్తున్నారనీ అన్నారుగూడెం గ్రామానికి చెందిన పత్తి రైతులు ఆరోపిస్తున్నారు. తల్లాడలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రానికి ఆటోలు, వ్యాన్‌లలో వివిధ ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న పత్తిని దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి.. అదే పత్తిని రైతుల వద్ద నుంచి ఆధార్ కార్డులు తీసుకొని సీసీఐలో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని, అలాంటి వారిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని అన్నారుగూడెం రైతులు కోరుతున్నారు.

మూడు రోజులపాటు పత్తి కొనుగోలు నిలిపివేత

కారేపల్లి: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి కోటెక్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో మూడు రోజులపాటు పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి నరేష్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల భారీగా కొనుగోలు చేయడం వల్ల మిల్లు ప్రాంగణమంతా పత్తితో నిండిపోయిందన్నారు. కావున తాత్కాలికంగా మూడు రోజులపాటు నిలిపివేసి ఖాళీ చేసిన తర్వాత యధావిధిగా కొనుగోళ్లు కొనసాగిస్తామన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

వాసిరెడ్డి వెంకటపతి వర్ధంతి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మధిర: మండలంలోని నక్కలగరుబు గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు, సీపీఐ నాయకులు వాసిరెడ్డి వెంకటపతి 27వ వర్ధంతి వేడుకను శనివారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని వెంకటపతి విగ్రహానికి ఆయన కుటుంబ సభ్యులు, న్యాయవాది వాసిరెడ్డి వెంకటేశ్వరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాసిరెడ్డి వెంకటపతి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బోనకల్ సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, చెరుకూరి వెంకటేశ్వరావు, సంపసాల రామకృష్ణ, యరదేశి మల్లిఖార్జున్, దేవిశెట్టి మల్లయ్య, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నిదానాల్లో అన్నదానం మిన్న



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

మధిర: అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అని ఆర్యవైశ్య సంఘం నాయకులు కపిలవాయి జగన్, వేముల ఆంజనేయులు తెలిపారు. శనివారం వర్తక సంఘం వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద దాతల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పేదవారి ఆకలి తీర్చేందుకే ప్రతీ శనివారం వర్తక సంఘం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, రామకృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

బంజారా కాలనీలో..

బంజారా కాలనీ వేకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు గంగవరపు వీరారెడ్డి ప్రారంభించారు.

పెద్దమునగాల మాజీ సర్పంచ్ మృతి



దాడె పుల్లయ్య

కొణిజర్ల: మండలంలోని పెద్దమునగాల పంచాయతీ మాజీ సర్పంచ్ దాడె పుల్ల య్య (57) శనివారం అకస్మాత్తుగా మృతి చెందారు. శుక్రవారం కొణిజర్లలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద పని చూసుకోవడానికి వచ్చిన ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గమనించిన స్థానికులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు వైద్యులు గుర్తించి వెంటనే హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఆయనకు భార్య, ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని కురమ సంఘం నాయకులు చిన్నం మల్లేశం, పగడాల మధు, యర్రా బాబు, మార గంగయ్య, దొడ్డి సాంబయ్య, బండారు రాంబాబు, యర్ర కృష్ణ, తదితరులు సందర్శించి మృతదేహంపై పూల మాలలేసి నివాళులు అర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు తాతా సుధాకర్ సంతాపం ప్రకటించారు.

కట్ల రంగారావు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కట్ల రంగారావు

వైరా: టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు జన్మదిన వేడుకలను శనివారం వైరాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా కాంగ్రెస్ కార్యకర్తలు కట్ల రంగారావును శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కష్టకాలంలో పార్టీ అభివృద్ధికి పార్టీ కార్యకర్తలకు అండగా ఉన్న రంగారావుకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్ల నాగరాజు, రేచర్ల రాముడు, గుడిమల్ల రత్తయ్య, భాస్కర్, వీరబాబు, సత్యనారాయణ, పుల్లయ్య, విశ్వనాధం, కృష్ణ, శ్రీకాంత్, కిరణ్, రామకృష్ణ, రవి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

జమలాపురానికి పాదయాత్ర, పూజలు

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గ ఎమ్మెల్యేగా మల్లు భట్టి విక్రమార్క నాల్గోవ సారి విజయం సాధించడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయటంతో శనివారం మండలంలోని లక్ష్మీపురం, తక్కెళ్లపాడు గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కాలినడకన తెలంగాణా తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని మొక్కు తీర్చుకున్నారు. ఎన్నికల్లో సమయంలో కాంగ్రెస్ గెలిస్తే పాదయాత్రగా ఆలయానికి చేరుకుంటామని శ్రీవారికి మొక్కుకున్నారు. కోరికలు నెరవేరడంతో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మండల కమిటీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు తల్లపురెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు శ్రీవారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. టెంకాయలు కొట్టారు. కార్యకర్తల పాదయాత్రకు మండల నాయకులు బండారు నర్సింహారావు, కడియం శ్రీనివాసరావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాముసూరు ఎంపీటీసీ తల్లపురెడ్డి ప్రవల్లిక, ఉప సర్పంచ్‌లు స్రవంతి, నాగిరెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



జమలాపురం ఆలయంలో మొక్కు తీర్చుకుంటున్న కాంగ్రెస్ నాయకులు